# ఆనందోబ్రహ్మ

— కలిదిండి జయ

ఉదయం లేచినదగ్గర్నుంచీ ఒకటే పని. కానీ ఆ పని చెయ్యడంలో నాకు ఆనందం వుంది.

ఆయనకి ఉల్లిపాయలు ఎక్కువ వేసి చేసే వుప్మా అంటే ఇష్టం. గబగబ ఉల్లిపాయలు తరుగుతున్నా—కళ్ళ నుంచి ధారాపాతంగా నీరు.

"అయ్యిందా టిఫిన్—అవతల టైమవుతోంది నాకు—" ఆయన... చిరాకుని కోపానికి జోడిస్తూ...

చక్కటి అందమైన కనుముక్కు తీరుతో—అందమైన మొహం—ఆ చిరాకు, కోపాల కలగలపుతో వికారంగా తయారయ్యింది. ఎందుకు సహజమైన అందాన్ని వికారంగా మార్చుకుంటారు అనిపించింది ఆయన మొహం అలా చూడగానే—

"ఇదిగో ఒక్క నిముషం!"

"నేను ఆఫీసుకి తొమ్మిదికల్లా తగలడాలనే జ్ఞానం వుందా అసలు నీకు. ఓ టైమ్ సెన్సు... పాడూలేదు. ఛీ! ఏం మనిషివో!" విసుక్కుంటూ ముందుగదిలోకి వెళ్లి—కుర్చీలో కూలబడి పేపరు తిరగెయ్యడం మొదలెట్టారు.

టైము చూశా—ఇంకా ఎనిమిది అవనేలేదు. టైమ్‌సెన్సు లేనిది ఎవరికి? అనిపించి మనసులోనే చిన్న నవ్వు.

వేడి వేడి ఉప్మా ప్లేట్లల్లోకి సర్దుతుంటే—పదిహేనేళ్ళ కూతురు పాలికేక పెట్టింది—"మమ్మీ—నా కాన్వెంటు డ్రెస్ ఇస్త్రీచేసి లేదేం!" అంటూ—

"వస్తున్నా అమ్మలూ—రాత్రి జ్ఞాపకం లేకపోయిందమ్మా—"

"ఏమిటి మమ్మీ—ప్రతిరోజూ ఇంతే నువ్వు—నాకు కాన్వెంటుకి లేటవుతోంది. చిరాకు—" అంటూ విసురుగా వెళ్లి సోఫాలో కూలబడింది.

పచ్చటిఛాయ దానిది. కోపంవల్ల మొహం ఎర్రగా కందగడ్డలా తయారయ్యింది.—కోపంతో పళ్ళు కొరుక్కుంటుంటే—దానిమ్మగింజలే దాని పళ్ళు! అనవసరంగా అలా నూరేసుకుంటూ పాడుచేసుకుంటోంది అనిపించింది.

టిఫిన్ ప్లేటు ఒకటి ఆయనకి అందించి మరొకటి దానిచేతికి ఇస్తే—"ఛీ వుత్త వుప్మానా—ఏమిటమ్మా నువ్వు, చిరాకు" అంది.

దానికి ఎందుకు ప్రతీదీ చిరాగ్గా అన్పిస్తుందో నాకు ఇప్పటికీ అంతుపట్టదు.

దాని డ్రెస్ ఇస్త్రీ చేస్తుంటే—ఈలోగా బాత్రూంలోంచి పద్దెనిమిదేళ్ల కొడుకు రంకెవేశాడు.

"మమ్మీ! సోప్ లేదేమిటి? డామిట్!" అంటూ.

హఠాత్తుగా గుర్తొచ్చింది. నిన్న సాయంత్రం, ఆయన రాగానే. కావల్సిన వస్తువుల లిస్టు ఒకటి ఓపిగ్గా కూర్చుని రాసిచ్చాను.

ఆయన దాన్ని జేబులో పడేసుకుని, ఏ ఫ్రెండ్‌తోనో బాతాఖానీ వేసి రాత్రి పది దాటుతుండగా ఇల్లు చేరుకున్నారు.

"సామానేదీ?" అంటే—

"ఇదిగో జేబులో దాచుకున్నా—ఏం మనిషివి కామన్ సెన్సు వుండదు—" వ్యంగ్యంగా అని "భోజనం వడ్డించు—" అంటూ చిరాకుపడ్డారు. ఆ లిస్టులో సబ్బులు కూడా ఒక ఐటమ్.

"సోప్ లేదురా కన్నా—ఈ ఒక్కపూటకి ఎలాగో సర్ది పెట్టుకుని అలా స్నానం చేసిరా—"

ధడాలున తలుపు తెర్చుకుని వచ్చి—"ఏమిటి సోప్ లేకుండా స్నానమా—డామిట్—"అన్నాడు.

ఉన్న చిన్నముక్క తండ్రీ, కూతురు అవజేసినట్టున్నారు.

"పోనీ సున్నిపిండి ఇస్తాను. ఈ పూటకి దానితో రుద్దుకోరా కన్నా—"

"సున్నిపిండా! డామిట్—నాకు సోప్ కావాలి. తీసుకురా!" అనేసి మొహం చిట్లించుకున్నాడు.

వాడిది చక్కటి నుదురు, పెద్దకళ్ళు. కానీ ఈ చిట్లించుకునే అలవాటు వచ్చాక, నుదుటి మీద గీతలు, కళ్ళుసాగి, చిన్నవిగా అయిపోయినట్టున్నాయి. అది వాడికెందుకు గ్రహింపుకి రాదో నాకు అర్థంకాదు.

"అమ్మలూ! కాస్త రెండడుగులు వేసి కొట్టుకు వెళ్లి-అన్నయ్యకు సోప్ తీసుకురామ్మా—"

"ఏమిటమ్మా అసలే కాన్వెంటుకి లేటనుకుంటుంటే పనులు చెబుతావు. చిరాకు—"

గబగబ ఇస్త్రీ చేసిన డ్రెస్ దానికి అందించి—జుత్తు వేళ్ళతో పైకి దువ్వుకుని వేలుముడి వేసుకుని—దగ్గరలోని స్టోర్స్‌కి వెళ్ళాను. మావాడు ఉపయోగించే బ్రాండ్ సబ్బు స్టాకులేదు. దాంతో మరో సబ్బు తీసుకున్నాను.

"ఛీ—అన్నీ నువ్విలాగే చేస్తావు మమ్మీ—ఆ సోప్ లేకుండా ఎలా, ఈ సోప్ అంటే నాకసహ్యం అని నీకు తెలీదూ? డామిట్" అని విసుక్కుంటూ బాత్రూంలోకి వెళ్ళాడు.

పని చేసుకుంటూనే వంటింట్లోంచి బయటికి చూశాను. నీలాకాశంలో పదకొండు గంటల సూర్యుడు ప్రకాశిస్తున్నాడు.

అలా చూస్తుంటే—నాకు ఆనందం కలిగింది. ఎందుకో తెలీదు. కానీ—

గాలి వీస్తే నాకానందం.

గాలికి ఆకులు వూగిసలాడితే నాకానందం

వర్షం కురిస్తే నాకానందం

వర్షంలో పువ్వులు తడుస్తూ వికసిస్తుంటే నాకానందం

మబ్బులు తేలితే నాకానందం

చంద్రుడు వెన్నెల నవ్వు నవ్వితే నాకానందం

అన్నీ—ప్రకృతిలోని సమస్తం నాకు ఆనందాన్ని కలగ చేస్తాయి.

మధ్యాహ్నం—కాస్త పని నుంచి తెరిపినపడ్డా సరిగ్గా, ఈ సిటీలోనే మరో ఏరియాలో వుంటున్న చెల్లెలు లత వచ్చింది.

కూడా ఏడేళ్ళ కొడుకు సంతోష్‌ని వెంటబెట్టుకు వచ్చింది.

వాడు వచ్చి మౌనంగా కుర్చీలో కూర్చుని బొమ్మలు కామిక్స్ తిరగేస్తున్నాడు.

ఇది వచ్చీ, రావడంతోనే వుస్సూరుమంటూ సోఫాలో కూలబడి—"కాస్త నడుం వాలుస్తా దిండు పడెయ్యి"—అంది.

దిండు యివ్వగానే అది తలక్రింద సర్దుకుని సోఫాలో వీలుగా పడుకుని—తన బాధాగాథల లిస్టు బయటకు లాగి వాటిని వర్ణిస్తోంది.

దానికి వంట వండటం కష్టం.

చుట్టం వస్తే కష్టం.

నెలాఖరు అంటే కష్టం.

భర్త మారుమాట్లాడితే కష్టం.

కొడుకుని స్కూలుకి పంపించడం దగ్గర్నుంచి వాడి పనులన్నీ కష్టమే!

ప్రక్కింటి ఆవిడ ఏదైనా కొత్త వస్తువు కొంటే, ఎదురింటి ఆవిడ సినిమాకెళితే దానికి పాపం ఎంతో కష్టం! దాని కష్టాలు వింటుంటే, నవ్వొచ్చింది.

ఒకసారి నాకు గిల్టీగా అన్పిస్తూవుంటుంది. హృదయం నిండా ఇంత 'ఆనందం' దాచుకుని—తను ఒక్కతే ఆ అనుభూతిని అనుభవించడం తప్పుకుని—

* * *

ప్రక్కింటినుంచి కబురు. నాకు ఫోన్ వచ్చిందని. అప్పుడప్పుడు లతే ఫోను చేస్తూవుంటుంది.

వెళ్ళేసరికి—"ఈ రోజు సంతోష్ పుట్టినరోజు—నువ్వు రావాలి" అంది.

అప్పటికి ఏడవుతోంది. ఇంటి నిండా ఆయన తాలూకు బంధువులు. ఇంకా వంట మొదలులోనే వుంది.

"అదేమిటే! కనీసం ప్రొద్దుటైనా చెప్పావు కాదు. పనులన్నీ ముందే పూర్తిచేసుకుని వచ్చేదాన్ని—"

"బావుంది. అసలు నిన్ను పిలవాలనుకోలేదు. ఈ వెధవ ఇప్పుడు గొడవ చేస్తున్నాడు. 'ఆమ' రాకపోతే కేకు కొయ్యను. పుట్టినరోజు చేసుకోను—అని—"

"ఎలాగే రావడం—ఇంటి నిండా జనంవున్నారు. వాళ్ళకి భోజనాలు అవీ—"



"బావుంది. నీకు కుదరదని నాకు తెలీదూ—కానీ ఈ వెధవ నా మాట వింటేనా—! ఐదు గంటల నుంచి—స్కూలు నుంచి ఇంటికి వచ్చినప్పటినుంచీ శతపోరు. సరేలే!" అంటూ ఫోను పెట్టేసింది.

ఐదు గంటలు నుంచీ వాడు గొడవచేస్తే అది ఇప్పుడు ఏడవుతుండగా ఫోను చేసింది.

లోపలికి వచ్చి వంటపనిలో పడ్డాను.

సుమారుగా తొమ్మిదవుతుండగా—"ఆమా!" అనే సన్నగొంతు విని వెనక్కిచూశాను.

"సంతోష్!"

ముద్దుగా, అపురూపంగా, ముచ్చటగా వున్నాడు తెల్లటి డ్రస్సులో—చేతిలో ఎర్రగులాబీ! ఆశ్చర్యం వేసింది.

"నువ్వెలా వచ్చావురా? అమ్మ ఏదీ?"

"అమ్మకి తెలికుండా వచ్చేశా—"

భయం వేసింది. ఈ సిటీ రద్దీలో, సిటీ బస్సులో—ఒక్కడూ అక్కడ్నుంచి వచ్చాడని తెలిగానే—

నేనెప్పుడూ వాడిని పెద్దగా పట్టించుకున్న గుర్తులేదు. చెల్లెలు కొడుకు 'సంతోష్' అని తప్ప.

దగ్గరగా వచ్చి, ఎర్రగులాబీ నాకు అందిస్తూ—"నీకు పువ్వులంటే ఇష్టం కదూ అమ్మా!" అన్నాడు.

నా ఇష్టాన్ని గుర్తించినవాడిని—నా మీద వాడికి వున్న మమతానుబంధాన్ని ఇన్నాళ్ళూ, నేను గుర్తించనందుకు 'గిల్టీ'గా అనిపించింది.

"ఎందుకురా ఇంత రాత్రి వచ్చావు. అమ్మానాన్నా ఎంత కంగారు పడుతూవుంటారు?"

"నాకు నువ్వంటే ఇష్టం ఆమా—ఈ రోజే నిన్ను తప్పకుండా చూడాలనిపించింది. నా పుట్టిన రోజుగా. అందుకు—మళ్ళీ ఈ పుట్టినరోజు రేపు వుండదు కదూ ఆమా!"

చిన్నారి కన్నయ్య తన జీవితం నుంచి కదలివచ్చి—ఇన్ని మాటలతో నా హృదయం నింపుతుంటే—ముప్పైఐదేళ్ళ జీవితంలో మొదటిసారి, కేవలం ప్రకృతే 'ఆనందం' ఇస్తుంది అనుకుంటున్న నాకు—వాడు—తన చిన్న గులాబీతో—చిన్నచిన్న మాటలతో—జన్మజన్మల్లో మర్చిపోలేని ఆనందాన్ని మూటకట్టి ఇచ్చాడు.

ఒక్కసారిగా పెనవేసుకుని వాడి చిన్న నుదుటి మీద ముద్దు పెట్టుకున్నా.

నా కనులలో ఆనందబాష్పాలు

నా పెదవులపై ఆనందలాస్యం

నా హృదయంలో ఆనంద గోదావరి.

ముప్పైఐదు వసంతాలు నిండినా—బీటువడిన హృదయంతోనే వున్న నా మీద పన్నీటిజల్లు కురిపించాడు.

ఒక మనిషి "నువ్వంటే నాకు ఇష్టం—"అని అమాయకంగా చెప్పడం... ఆ మూడు పదాల అనుభవం యింత ముగ్ధ మనోహరంగా... యింత ముచ్చటగా... యింత అద్భుతంగా వుంటుందా?!

ఒక్కరంటే ఒక్కరు—ఇన్నినాళ్ళ జీవితంలో 'నన్ను' గుర్తించనే లేదు. కానీ ఈ ఏడేళ్ళ పసివాడు నన్ను 'నన్ను'గా గుర్తించాడు. నాలోని చివరి శ్వాస ఆడేంతవరకూ—నేను మర్చిపోలేని ఆనందానికి 'బ్రహ్మ' అయ్యాడు.

'నాయనా! నా చిన్నారి కన్నతండ్రీ! నీకు నా కృతజ్ఞతలు ఎలా చెప్పుకోగలనురా! ఇలాంటి... లేదు... రాలేదు... ఇకరాదు.... అనుకున్న ఒక్క 'నిముషం' నా జీవితంలో సృష్టించినందుకు నీకు జన్మజన్మలకూ ఋణపడివుంటానురా'

తల్లీ, తండ్రీ, స్నేహితులు, భర్త, తోడబుట్టినవాళ్ళూ కొడుకు—కూతురు, బంధువులు—ఎవరూ—ఎవరూ పెదవి కదిపి చెప్పని... చెప్పలేని మాటల్నిఎంత గొప్పగా చెప్పావురా తండ్రీ!

'ఒక మనిషి మరొక మనిషిని నిర్మలంగా ఇష్టపడటానికి ఎంత హృదయౌన్నత్యం వుండాలిరా—!అది నీలో నిండుగా వుంది. కేవలం ప్రకృతిలో అందాన్ని వెదుకుంటున్న ఈ ఒంటరి హృదయానికి—మురిపెంగా పలికిన మూడు ముక్కలతో 'ఈ జీవితంలోనూ నువ్వు ఆనందాన్ని కోల్పోలేదు ఆమా' అని చెప్పిన నా చిన్ని బంగారూ!!

పెదవి దాటిరాలేని ఈ భావాల్ని—మౌనమైన నా మొహంలో చదివాడేమో చిరునవ్వులు చిందిస్తూ నావైపు చూస్తుండిపోయాడు చిన్నారి సంతోష్.